క్లుప్తంగా

విద్యార్థుల ఎడ్యుకేషన్ టూర్



ఎడ్యుకేషన్ టూర్‌లో విద్యార్థులు ఉపాధ్యాయులు

సిద్దవటం : విద్యార్థులు తరగతి గది పాఠాలతో పాటు క్షేత్రస్థాయి పర్యటనలు ఎంతో అవసరమని ఉపాధ్యాయులు తెలిపారు. గురువారం మండల కేంద్రంలోని దిగువపేట గాంధీ వీధిలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులను ఎడ్యుకేషనల్ టూర్‌లో భాగంగా సిద్దవటం మట్లిరాజుల కోటకు తీసుకెళ్లారు. పాఠశాల ఉపాధ్యాయులు అంజనమ్మ, ప్రసన్న, నీలి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో కోటలోని విషయాలను విద్యార్థులకు వివరించారు. కోటలోని ముఖ ద్వారం, మొదటి, రెండవ మండపాలు, పార్కు, మూతి విరిగిన నంది విగ్రహం, తవ్వకాల్లో బయటపడిన శివలింగం, కామాక్షమ్మగుడి, బిస్మిల్లాషావలి దర్గా, మసీదు, పెన్నానదిలోకి వెళ్లే సొరంగ మార్గం, రాణి స్నాన వాటిక, రాణీ మహల్ వంటి కట్టడాలను తిలకించారు.

టపాసుల గోడౌన్‌ను పరిశీలించిన సబ్ కలెక్టర్



గోడౌన్‌ను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్

చిట్వేలి : చిట్వేలి గురుగుపల్లి రోడ్డు పక్కన టపాసుల గోడౌన్‌ను గురువారం రాజంపేట సబ్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ పరిశీలించారు. చిట్వేలికి చెందిన కామిశెట్టి ప్రతాప్‌కు చెందిన టపాసుల గోడౌన్ లైసెన్సు ముగియడంతో తిరిగి లైసెన్సును పునరుద్ధరించేందుకు పరిశీలించి వివరాలను తహసీల్దార్ మురళీకృష్ణను అడిగి తెలుసుకున్నారు. జన సమూహానికి దూరంగా పంటపొలాల్లో రక్షణ సదుపాయాలను పరిశీలించారు. కార్యక్రమంలో ఆర్ఐ శేషంరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

29న ఎక్సైజ్ వాహనాల వేలం

మదనపల్లె : మదనపల్లె ఎస్ఈబీ స్టేషన్ పరిధిలో ప్రొహిబిషన్, ఎక్సైజ్ నేరాల్లో సీజ్‌చేసిన వాహనాలను ఈనెల 29వ తేదీ శనివారం ఉదయం 10గంటలకు వేలం వేయనున్నట్లు ఇన్‌చార్జ్ సీఐ శ్రీహరిరెడ్డి తెలిపారు. గురువారం ఎస్ఈబీ స్టేషన్ విడుదల చేసిన పత్రికాప్రకటనలో... వాహనాల వేలంలో పాల్గొనే వారు జీఎస్టీ రిజిస్ట్రేషన్ కలిగి ఉండాలని, ప్రభుత్వం నిర్దేశించిన డిపాజిట్లు చెల్లించాల్సి ఉంటుందన్నారు. హెచ్చుపాటదారునికి తప్ప మిగిలిన వారికి డిపాజిట్ పైకం వేలం ముగిసిన వెంటనే వాపసు ఇస్తామన్నారు. హెచ్చుపాటదారుడు వేలం మొత్తం చెల్లించిన తర్వాత వాహనం ఉన్నది ఉన్నట్లుగా స్వాధీనం చేస్తామన్నారు.

పొగాకు వాడకం వల్ల అనర్థాలు

మదనపల్లె సిటీ: పొగాకు వాడకం వల్ల పలు అనర్థాలు తలెత్తుతాయని ప్రభుత్వ మహిళా డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కృష్ణవేణి అన్నారు. గురువారం కాలేజీలో పొగాకు వినియోగం–దుష్పరిణామాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ పొగాకు వినియోగించడం వల్ల మానసికంగా నియంత్రణ కోల్పోతారన్నారు. ప్రభుత్వ కార్యాలయంలో పొగాకు వాడటం నేరమన్నారు. కార్యక్రమంలో సైక్రియాటిస్టు డాక్టర్ రాధిక, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ జ్యోతి, అధ్యాపకులు వనజ, నమ్రత, లక్ష్మీదేవి, నాగమణి పాల్గొన్నారు.

కళాకారులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలి

బి.కొత్తకోట: కళాకారులకు ప్రభుత్వం గుర్తింపు కార్డులు ఇవ్వాలని వైఎస్సార్‌సీపీ సాంస్కృతిక విభాగం జిల్లా అధ్యక్షులు సుధాకర్‌రెడ్డి కోరారు. గురువారం బి.కొత్తకోటలో ఆ పార్టీ సాంస్కృతిక విభాగం మండలస్థాయి కమిటీ ఎన్నిక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీపీ లక్ష్మీనరసమ్మ, జెడ్పీటీసీ రామచంద్ర మాట్లాడుతూ ప్రభుత్వం అన్నివర్గాలకు అండగా నిలిచిందన్నారు. సమావేశంలో బి.కొత్తకోట మండల అధ్యక్షులుగా రమణప్ప, ఉపాధ్యక్షులుగా సిద్దారెడ్డి, కార్యదర్శిగా లక్ష్మీదేవి, సహాయకార్యదర్శిగా బి.శేఖర్, కోశాధికారిగా నరసింహారెడ్డి, మహిళా విభాగం అధ్యక్షురాలిగా పి.అంజనమ్మను ఎన్నుకొన్నట్లు సుధాకర్ రెడ్డి తెలిపారు. ఈ ఎన్నికలో నియోజకవర్గ అధ్యక్షులు కత్తి శివమణి, ప్రచార కార్యదర్శి అంకిరెడ్డి చెవిరెడ్డి పాల్గొన్నారు.

మద్యం విక్రేత అరెస్ట్

బి.కొత్తకోట: కర్ణాటక మద్యం విక్రయిస్తున్న మహిళను అరెస్ట్ చేసినట్టు ఎస్ఐ రామమోహన్ గురువారం తెలిపారు. మండలంలోని గోళ్లపల్లె పంచాయతీ బంగ్లాగడ్డకు చెందిన రెడ్డెమ్మ (60) కర్ణాటక మద్యం విక్రయిస్తోంది. దీనిపై అందిన సమాచారంతో దాడులు నిర్వహించగా 70 ప్యాకెట్ల మద్యం పట్టుబడినట్టు తెలిపారు. కేసు నమోదుచేసి మహిళను అరెస్ట్ చేసినట్టు తెలిపారు. అక్రమ మద్యంపై ఉక్కుపాదం మోపుతున్నట్టు స్పష్టం చేశారు.

సంక్షేమం అందిస్తున్నాం.. సమస్యలు పరిష్కరిస్తున్నాం

గడప గడపకు మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి



బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎంపీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే గడికోట

సంబేపల్లె : రైతు సంక్షేమమే రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ధ్యేయమని వైఎస్సార్‌సీపీ అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు, రాయచోటి ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. గురువారం శెట్టిపల్లె గ్రామంలోని యరమోర్రంపల్లె, దళితవాడ, రెడ్డు మళ్లవారిపల్లె, మర్రిమేకలపల్లె, చెరుకువాండ్లపల్లె, వలబండపల్లె, కొండకిందపల్లె, దొడ్డిసిద్దయ్యగారి పల్లె, నాయనివారిపల్లె, నూతనగడ్డపల్లెలలో మాజీ డీసీఎంఎస్ చైర్మన్ ఆవుల విష్ణువర్ధన్‌రెడ్డితో కలిసి గడప గడపకు కార్యక్రమంలో శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు. ప్రజా సంక్షేమం కోసం కష్టపడుతూ అభివృద్ధి కార్యక్రమాలు ప్రణాళిక బద్ధంగా ముందుకు సాగుతూ.. జగనన్న ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ ఫలాలను ప్రజలకు చేరవేస్తూ తద్వార ప్రజలలో గూడు కట్టుకున్న ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డికి అడుగడునా ఘనస్వాగతం పలికారు. ఆయన మాట్లాడుతూ వైఎస్ జగనన్న పాలనలో ప్రతి ఇంటికి లబ్ధి చేకూరే విధంగా సంక్షేమ పథకాలతోపాటు సమాజంలో అభివృద్ధిని చేసి చూపారన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలతో ప్రతి ఒక్కరి సంతృప్తి స్థాయి పెరగడం జగనన్న పాలనకు నిదర్శనమన్నారు. గ్రామంలో ఇంటింటికి వెళ్లి వారి సమస్యలను తెలుసుకొని పరిష్కార దిశగా చర్యలు చేపడతామన్నారు. గ్రామంలో అర్హులైన వారికి ఇంటి స్థలాలు, పక్కాగృహాల మంజూరు చేస్తామని ఎమ్మెల్యే హామీనిచ్చారు.

దళితవాడ ఆలయం వద్ద రూ. 2 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణం పనులు చేపడతామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. శెట్టిపల్లె గ్రామంలో శ్రీకాంత్‌రెడ్డి 5 రోజులగా 53 పల్లెలను సందర్శించారు. పలు ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి చిదంబరంరెడ్డి, ఎంపీపీ నాగశ్రీలక్ష్మీ, జెడ్పీటీసీ కవిత, మాజీ జెడ్పీటీసీ ఉపేంద్రనాథ రెడ్డి, మండల కన్వీనర్ ఉదయ్‌కుమార్‌రెడ్డి, రమేశ్‌రెడ్డి, అనిరుథ్‌రెడ్డి, మాజీ ఎంపీపీ నాగిరెరెడ్డి, నాయకులు బ్రహ్మానందరెడ్డి, ఆనంద్‌రెడ్డి, న్యాయవాది శ్రీనివాసులరెడ్డి, మల్లికార్జునరెడ్డి లక్ష్మీకర్‌రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ వడ్డి వెంకటరమణారెడ్డి, కిషోర్‌కుమార్‌రెడ్డి, నరసింహరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గ్రామ స్వరాజ్యానికి ప్రతిరూపాలు సచివాలయాలు

సంబేపల్లె : గ్రామ స్వరాజ్యానికి ప్రతి రూపంగా జగనన్న ప్రవేశపెట్టి గ్రామ సచివాలయాలు నిలుస్తున్నాయని లోకసభ ప్యానెల్ స్పీకర్, ఎంపీ మిథున్ రెడ్డి, ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డిలు అన్నారు. ముందుగా ఎంపీ, ఎమ్మెల్యేలకు నాయకులు పూర్ణ కుంభ స్వాగతం పలికారు. గురువారం మండల పరిధిలోని శెట్టిపల్లె పంచాయతీలో నూతనంగా నిర్మించిన సచివాలయం, వైఎస్ఆర్ రైతుభరోసా, డాక్టర్ వైఎస్ఆర్ విలేజ్ క్లీనిక్ భవనాలను నాయకులతో కలిసి వారు ప్రారంభించి, మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రామ సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసి పారదర్శకంగా, ప్రతిష్టాత్మకంగా గ్రామ స్థాయిలోనే ప్రజలకు సేవలు అందిస్తున్నారన్నారు. ప్రజా అవసరం నిమిత్తం జిల్లా, మండల కేంద్రాలకు వెళ్లే అవసరం లేకుండా వలంటరీ వ్యవస్థ ద్వార ఇంటి ముంగిటకే సంక్షేమ పథకాలు, సేవలను అందిస్తున్నామన్నారు. గ్రామ సచివాలయాలకు కోట్లాది రూపాయలతో శాశ్విత కార్యాలయాలు నిర్మిస్తున్నామన్నారు. రైతులకు విజ్ఞాన కేంద్రాలుగా రైతు భరోసా కేంద్రాలు, వైద్యరంగంలో విప్లవాత్మక మార్పులతో వైఎస్ఆర్ విలేజ్ క్లీనిక్ కేంద్రాలు ప్రజలకు సేవలందిస్తాయని తెలిపారు. అనంతరం గ్రామ సముదాయాల ప్రాంగణంలో వారు మొక్కలను నాటారు. పలు సమస్యలపై స్థానిక నాయకులతో చర్చించారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

పెనగలూరు : మండలంలో విద్యుత్ లైన్లపై ఉన్న చెట్లు తొలగించేందుకు శుక్రవారం విద్యుత్ నిలిపివేయబడుతుందని విద్యుత్ ఏఈ షఫీ తెలిపారు. పెనగలూరు, కొండూరు, బెస్తపల్లి, తిమ్మాయిగారిపల్లి సబ్‌స్టేషన్ల పరిధిలోని గ్రామాలలో ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు. ప్రజలు, రైతులు సహకరించాలని ఆయన కోరారు.

'ఏపీలో బలమైన శక్తిగా ఎదుగుతాం'

సిద్దవటం : ఆంధ్రప్రదేశ్‌లో భారతీయ జనతా పార్టీ బలమైన శక్తిగా ఎదుగుతుందని బీజేపీ రాజంపేట అసెంబ్లీ ఇన్‌చార్జి కన్వీనర్ రామ జగదీష్ ఆశాభావం వ్యక్తం చేశారు. మండల కేంద్రంలో గురువారం ఆయన విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బూత్ స్వశక్తికరణ అభియాన్ కార్యక్రమంలో భాగంగా బూత్ కమిటీల నిర్మాణం, సంస్థాగత వ్యవహారాలపై ఆయన చర్చించారు. బీజేపీ కార్యకర్తల ముందు ఆ రెండు పార్టీలు దిగదుడుపు అని తెలియజేశారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు సుబ్బరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి సురేష్‌రాజు, జిల్లా కిసాన్ మోర్చా ఉపాధ్యక్షుడు పాపయ్య, అమర్‌నాథ్‌శర్మ, ఉపాధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి, నాయకులు రాజారెడ్డి, సుబ్బరాయుడు పాల్గొన్నారు.

పథకాలతో పేదల జీవన ప్రమాణాలు మెరుగు



మా భవిష్యత్తు నువ్వే జగన్ కార్యక్రమంలో పోలా శ్రీనివాస్‌రెడ్డి

రాజంపేట టౌన్ : పథకాలను లబ్ధిదారుల ఇంటికే చేర్చుతున్న ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలోని 3, 4, 17వ వార్డుల్లో గురువారం పోలా ఆధ్వర్యంలో మా భవిష్యత్తు నువ్వే జగన్ కార్యక్రమాన్ని విస్తృతంగా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికి వెళ్లి జగన్ సీఎం అయ్యాక నవరత్నాల ద్వారా ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. పథకాల లబ్ధిని తెలియజేశారు. అనంతరం పోలా శ్రీనివాస్‌రెడ్డి విలేకరులతో మాట్లాడారు. సంక్షేమ పథకాల వల్ల పేదల జీవన ప్రమాణాలు మెరుగుపడ్డాయన్నారు. మరో ఏడాదిలో ఎన్నికలు జరుగనున్నాయని, ఆ ఎన్నికల్లో ప్రజలు జగన్‌కు తమ సంపూర్ణ మద్దతు ఇచ్చి వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ మర్రి రవి, కౌన్సిలర్లు ససిశెట్టి నవీన్‌కుమార్, న్యామతుల్లా, వైఎస్సార్ సీపీ వివిధ విభాగాల కన్వీనర్లు గోవిందు బాలకృష్ణ, చాపల ఖాజా, జాకీర్ తదితరులు పాల్గొన్నారు.

దేశభక్తి, క్రమశిక్షణను పెంపొందించేదే ఎన్‌సీసీ



మేజర్ రాజ్‌కుమార్‌ను సన్మానిస్తున్న చొప్పా ఎల్లారెడ్డి

రాజంపేట : యువతీయువకుల్లో దేశభక్తి, క్రమశిక్షణను పెంపొందించేదే ఎన్‌సీసీ అని 30వ ఆంధ్రా బెటాలియన్ కడప కమాండెంట్ ఆఫీసర్ మేజర్ రాజ్‌కుమార్ అన్నారు. గురువారం ఏఐటీఎస్‌లో ఏర్పాటు చేయనున్న ఎన్‌సీసీ సెంటర్‌ను ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు విద్యతో పాటు ఎన్‌సీసీలో చేరితే మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. మిలటరీలో ప్రవేశం పరీక్ష లేకుండా కమాండింగ్ ఆఫీసర్‌గా అర్హత పొందవచ్చునన్నారు. ఏఐటీఎస్ వైస్ చైర్మన్ చొప్పా ఎల్లారెడ్డి మాట్లాడుతూ శారీరక దృఢత్వంతో పాటు దేశానికి సేవచేసే భాగ్యం సైనికుడికే లభిస్తుందన్నారు. సమాజంలో ఎన్‌సీసీకి ప్రత్యేక గుర్తింపు ఉందన్నారు. ప్రిన్సిపాల్ డా.నారాయణ మాట్లాడుతూ ఎన్‌సీసీ ఏర్పాటు ఆవశ్యకతను విద్యార్థులకు తెలియజేస్తున్నామన్నారు. ఎన్‌సీసీ వల్ల క్రమశిక్షణతోపాటు సైనిక్ లక్షణాలు, సామాజిక సేవ దృక్పథం పెంపొందుతాయన్నారు. కార్యక్రమంలో ఫిజికల్ డైరక్టరు, ఎన్‌సీసీ కో–ఆర్డినేటర్ డా.బి.నాగముని, ఎన్‌సీసీ బోధకుడు కిషోర్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వేసవి శిక్షణా శిబిరాలను సద్వినియోగం చేసుకోండి



మాట్లాడుతున్న విద్యాశాఖ అధికారి రామకృష్ణుడు

రామాపురం : రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన వేసవి శిక్షణా శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంఈఓ రామకృష్ణుడు తెలిపారు. గురువారం మండల కేంద్రంలోని గ్రంథాలయంలో విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ మే నెల 8వ తేదీ నుంచి విద్యార్థులకు వేసవి శిక్షణా శిబిరాలను నిర్వహిస్తున్నారని, వేసవి సెలవుల్లో విద్యార్థులు సమయం వృథా చేసుకోకుండా గ్రంథాలయానికి వచ్చి పుస్తక పఠనం చేయాలన్నారు. పుస్తకపఠనం ద్వారా విద్యార్థుల్లో జ్ఞానం పెరుగుతుందని మనస్సు ప్రశాంతంగా ఉంటుందన్నారు. ప్రతి విద్యార్థి గ్రంథాలయానికి రావడాన్ని అలవాటు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి సూర్యనారాయణరెడ్డి, మండల విద్యాశాఖ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కడప రాయుడి గ్రామోత్సవం



గ్రామోత్సవంలో స్వామి, అమ్మవార్లు

కడప కల్చరల్ : తిరుమలకు తొలిగడపగా భావిస్తున్న దేవునికడప శ్రీ లక్ష్మి వెంకటేశ్వరస్వామి గ్రామోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. స్వాతి నక్షత్రాన్ని పురస్కరించుకుని నిర్వహించిన ఈ కార్యక్రమంలో భాగంగా తొలుత మూల మూర్తికి, అనంతరం ఉత్సవమూర్తులకు విశేష అభిషేకం, అనంతరం కనుల పండువగా అలంకారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్సవమూర్తులను పలు రకాల పుష్పాలతో అలంకరించి ప్రత్యేక పల్లకీపై కొలువుదీర్చారు. భక్తుల జయజయధ్వానాల మధ్య పల్లకీ దేవునికడప మాడవీధుల్లో సాగింది. గ్రామస్తులు తమ వీధికి తరలివచ్చిన కడప రాయుడిని దర్శించుకుని పూజా ద్రవ్యాలు సమర్పించి ప్రార్థనలు చేశారు. అర్చకులు వారికి హారతులు, తీర్థ ప్రసాదాలు అందజేశారు. అర్చకులు త్రివిక్రమ్ తదితరులు ప్రత్యేక పూజలు నిర్వహించగా, ఆలయ ఇన్‌స్పెక్టర్ ఈశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఇతర కార్యక్రమాలు నిర్వహించారు.

వైఎస్సార్‌సీపీలో అన్ని వర్గాలకు సముచిత స్థానం

పీలేరు : వైఎస్సార్‌సీపీలో అన్ని వర్గాలకు సముచిత స్థానం కల్పిస్తున్నట్లు రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి వెంకటమిథున్‌రెడ్డి, పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. గురువారం స్థానిక ఎంఎస్ఆర్ కల్యాణమండపంలో పీలేరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన ఎంపీ, ఎమ్మెల్యేలు మాట్లాడుతూ పీలేరు మార్కెట్ కమిటీ ఛైర్మన్ పదవి ఓసీ కేటగిరికి కేటాయించబడినా, బడుగు బలహీన వర్గాలకు సముచిత స్థానం కల్పించాలనే ఉద్దేశంతో వడ్డెర సామాజిక వర్గానికి చెందిన చంద్రగిరి యల్లయ్యను ఏఎంసీ ఛైర్మన్ చేయడం జరిగిందన్నారు. పార్టీకి విశ్వాసంగా ఉన్న అన్ని సామాజిక వర్గాలకు సముచిత స్థానం కల్పిస్తామని తెలిపారు. వడ్డెర కులస్తులకు జనాభా ప్రాతిపదికగా చూస్తే రాజకీయంగా వారికి సరైన న్యాయం జరగలేదని గుర్తించామని చెప్పారు. దీంతో వడ్డెరలకు మంచి సందేశం ఇవ్వాలనే ఉద్దేశంతో వడ్డెర సామాజిక వర్గానికి ఉన్నతమైన ఏఎంసీ ఛైర్మన్ పదవి ఇచ్చినట్లు తెలిపారు. బీసీ, మైనారిటీ, ఎస్సీ, ఎస్టీ అన్ని వర్గాలకు ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డితోనే మంచి గుర్తింపు లభిస్తోందన్నారు. జగనన్న ప్రభుత్వంలో విద్య, ఆరోగ్యంకు పెద్ద పీట వేస్తున్నట్లు తెలిపారు. పేదలు ప్రతి ఒక్కరికీ సొంతింటి కల నెరవేర్చిన ఘనత మన ముఖ్యమంత్రికే దక్కుతోందన్నారు. నాలుగేళ్ల జగనన్న పరిపాలనలో జరిగిన అభివృద్ధి, చంద్రబాబు పద్నాలుగేళ్ల పరిపాలన మధ్య వ్యత్యాసం గమనించాలన్నారు. చంద్రబాబు కల్లబొల్లి మాటలు నమ్మి మోసపోవద్దు అని పిలుపునిచ్చారు. అనంతరం మార్కెట్ కమిటీ ఛైర్మన్ చంద్రగిరి యల్లయ్యను, వైస్ ఛైర్మన్ రమేష్‌రెడ్డిలను ఘనంగా సన్మానించారు. మార్కెట్ కమిటీ కార్యవర్గంతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే జి.వి. శ్రీనాథరెడ్డి, ఏపీ ఎండీసీ డైరెక్టర్ హరీష్‌రెడ్డి, నియోజకవర్గ పరిశీలకులు సహదేవ రెడ్డి, ఎంపీపీలు సతీష్‌రెడ్డి, ఈశ్వరమ్మ, జెడ్పీటీసీ రత్నశేఖర్‌రెడ్డి, గజ్జెల శృతి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కళాశాల విద్యార్థుల ప్రతిభ

రాజంపేట టౌన్ : ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల ఫలితాల్లో ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు ప్రతిభ చాటారు. దీంతో అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను గురువారం ప్రిన్సిపాల్ రామిరెడ్డి అభినందించారు. ద్వితీయ సంవత్సరం ఎంపీసీ విభాగంలో ఉప్పలపాటి శివసాయి కార్తీక్ 964 మార్కులు సాధించి కళాశాల టాపర్‌గా నిలిచారని తెలిపారు. అలాగే బైపీసీ విభాగంలో ఎస్.కైసర్ 885 మార్కులు, హెచ్ఈసీలో ఎస్.సాయికళ 759 మార్కులు, సీఈసీలో సి.నిర్మల 887 మార్కులు సాధించారని తెలిపారు. ఒకేషనల్ విభాగంలో అకౌంటింగ్ అండ్ ట్యాక్సేషన్‌లో టి.హర్షవర్దన్ 915 మార్కులు, నర్సింగ్‌లో పి.రజియా 940 మార్కులు, ఈటీలో సుధీర్‌కుమార్ 811 మార్కులు, సీఎస్‌సీలో పి.అరవింద్ 937 మార్కులు సాధించి వారి గ్రూపుల్లో టాపర్స్‌గా నిలిచారని తెలిపారు. కార్యక్రమంలో అధ్యాపకులు రవి, మనోహర్, కవిత, లక్ష్మీదేవి, జయమ్మ, పీడీ మురళీకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చిన్నమండెం ఆదర్శ పాఠశాల విద్యార్థులు

చిన్నమండెం : మండలంలోని ఆదర్శ పాఠశాల విద్యార్థులు మొదటి, రెండవ సంవత్సరం ఫలితాలలో జయభేరి మోగించినట్లు ప్రిన్సిపల్ రమేష్ తెలిపారు. ఇంటర్ ఫస్టియర్‌లో 45 శాతం, ఇంటర్ సెకండియర్‌లో 48 శాతం విద్యార్థులు పాసయ్యారన్నారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరం ఎంపీసీలో మెహర్‌ఖానం 913/1000 మార్కులు, తేజశ్రీ 903/1000 మార్కులు సాధించగా బైపీసీలో సాబా సుల్తానా 944/1000, నందిని 922/1000 మార్కులు సాధించారు. ఇంటర్ మొదటి సంవత్సర ఫలితాల్లో ఎంపీసీ గ్రూపులో నరేంద్ర 447/470, బి.రాణి 436/470, ఎస్.అతిక 434/470 మార్కులు సాధించినట్లు ప్రిన్సిపల్ తెలిపారు.

పెనగలూరు మండలంలో..

పెనగలూరు : మండలంలో ఇంటర్మీడియట్ పరీక్షా ఫలితాలలో బాలికలదే పైచేయిగా మిగిలింది. మోడల్ స్కూల్‌లో జూనియర్, సీనియర్ ఇంటర్మీడియట్ ఫలితాలలో బాలికలు ముందంజలో ఉన్నట్టు ప్రిన్సిపాల్ సహజబ్లెస్సీ తెలిపారు. జూనియర్ బైపీసీలో రేణుక 332 మార్కులు సాధించగా, సీఎస్ఈలో ఏ వెంకటమ్మ 395, బైపీసీలో యశస్విని 398 మార్కులు సాధించిదన్నారు. అలాగే సీనియర్ బైపీసీలో వనజ 821 మార్కులు, సీఎస్ఈలో సి.శివరాం 890, ఎంపీసీ గ్రూపులో సుష్మిత 897 మార్కులు సాధించారు. అధిక మార్కులు సాధించిన విద్యార్థులను ప్రిన్సిపాల్ అభినందించారు.

ఏపీ మోడల్ కాలేజీ విద్యార్థులు..

లక్కిరెడ్డిపల్లె : మండలంలోని ఏపీ మోడల్ కాలేజి విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారు. బుధవారం సాయంత్రం వెలువడిన ఇంటర్మీడియట్ ఫలితాలలో ద్వితీయ సంవత్సరం ఉత్తీర్ణత సాధించిన సయ్యద్ సారిక షబ్నమ్ బైపీసీ గ్రూపులో 945 మార్కులు సాధించగా, తులసీ 905 (బైపీసీ), గణతేజ 897 (బైపీసీ) మార్కులు సాధించారు. అలాగే రాజేశ్వరీ ఎంపీసీ గ్రూపులో 844 మార్కులు సాధించారు. అధిక మార్కులు సాధించిన విద్యార్థులను ప్రిన్సిపాల్ రేఖ, వైస్ ప్రిన్సిపాల్ రాజ్ కుమార్, అధ్యాపకులు విజయకుమారి, విజయ, శివశంకర్ రెడ్డి, విజయ, సుధాకర్, నిత్య పూజయ్య, సుజాతమ్మ, బ్రహ్ముద్వేగం, శ్రీకళలు విద్యార్థులను అభినందించారు.

మట్టి మాఫియాను అరికట్టాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్ : జిల్లాలో మట్టిమాఫియాను అరికట్టాలని కాంగ్రెస్ నాయకులు సత్తార్, బండి జకరయ్య పేర్కొన్నారు. ఈ విషయమై గురువారం కలెక్టరేట్‌లో డీఆర్వో గంగాధర్ గౌడ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులకు ప్రయోజనకరంగా ఉండటం కోసం.. భూము లు సారవంతం చేసుకునేందుకు చెరువు మట్టిని వ్యవసాయ భూములకు తరలించేందుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చిందన్నారు. దీనికోసం ఆర్డీవో, తహశీల్దార్, ఇరిగేషన్ ఈఈ అనుమతి తప్పని సరిగా తీసుకోవాలన్నారు. అయితే జిల్లాలో అధికారులు కాల పరిమితి లేకుండా అనుమతి ఇవ్వడంతో కొందరు మట్టి మాఫియాకు వరంగా మారిందన్నారు. రైతుల పేరిట అనుమతులు తీసుకొని రోడ్ల నిర్మాణం కోసం, భవన నిర్మాణాల కోసం ఇతరత్రా వ్యాపార అవసరాల కోసం అమ్ముకుంటూ రూ.కోట్లు గడిస్తున్నారని ఆరోపించారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ

కడప ఎడ్యుకేషన్ : కడప నగర శివార్లలోని ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో పాలిసెట్ -2023 పరీక్ష కోసం ఉచిత శిక్షణ పొందుతున్న విద్యార్థులకు గురువారం ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్, పాలిసెట్ జిల్లా కో–ఆర్డినేటర్ సిహెచ్. జ్యోతి స్టడీ మెటీరియల్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పాలిసెట్ ఉచిత శిక్షణకు పది పరీక్షలు రాసిన వివిధ పాఠశాలల నుంచి 50 మందిదాకా బాలబాలికలు వస్తున్నారని తెలిపారు. మీరందరికి ఉచిత శిక్షణతో పాటు స్టడీ మెటీరియల్‌ను అందచేశామన్నారు. పాలిసెట్ పరీక్షకు ఏప్రిల్ 30వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

సచివాలయం సిబ్బంది బాధ్యతగా పనిచేయాలి



సచివాలయం కార్యదర్శులతో మాట్లాడుతున్న కమిషనర్ గంగాప్రసాద్

రాయచోటి అర్బన్ : వార్డు సచివాలయం ఉద్యోగులు, సిబ్బంది ప్రజలతో బాధ్యతాయుతంగా పని చేయాలని మున్సిపల్ కమిషనర్ గంగాప్రసాద్ అన్నారు. గురువారం ఆయన పట్టణంలోని కొత్త పల్లె-1 సచివాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. సచివాలయంలోని వలంటీర్ల హాజరు పట్టిక, రికార్డులను తనిఖీ చేశారు. బయోమెట్రిక్ హాజరును తప్పక వేయాలంటూ సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ, అభివృద్ధి ఫలాలను ఎప్పటికప్పుడు అర్హులైన పేదలకు చేరవేయవలసిన ప్రధాన బాధ్యత వలంటీర్లదే అన్నారు. సచివాలయం ఉద్యోగులు సమయం కచ్చితంగా పాటించాలంటూ ఆదేశించారు. విధి నిర్వహణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కార్యదర్శులకు సలహాలు, సూచనలు ఇచ్చారు. అనంతరం వార్డు కౌన్సిలర్ రౌనఖ్ హుస్సేన్‌తో వార్డులోని సమస్యలపై చర్చించారు. జరుగుతున్న అభివృద్ధి పనులను గురించి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మున్సిపల్ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ మల్లికార్జునలతోపాటు వార్డు కార్యదర్శులు, వలంటీర్లు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో ప్రయోజనం

పీలేరు రూరల్ : ప్రకృతి వ్యవసాయంతో బహుళ ప్రయోజనాలు పొందవచ్చునని ఏవో రమాదేవి అన్నారు. గురువారం మండలంలోని ముడుపువేముల వీవో 2 పరిధిలో వెలుగు సభ్యుల ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంతో నేలతల్లి బాగుంటుందని, ఆరోగ్యకరమైన పంట దిగుబడి ఉంటుందని తెలిపారు. రసాయన ఎరువుల వాడకం పూర్తిగా తగ్గించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంటీ సుధా, ఎల్ఐ చిరంజీవి, ఎల్3డీ సావిత్రి, సర్పంచ్ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

సైబర్ మోసం

మదనపల్లె : సైబర్ మోసంతో చేనేతకార్మికుడు రూ.50వేలు పోగొట్టుకున్న సంఘటన గురువారం మదనపల్లె పట్టణంలో జరిగింది. నీరుగట్టువారిపల్లె, రామిరెడ్డి లేఅవుట్‌కు చెందిన చేనేత కార్మికుడు సుబ్రహ్మణ్యం సెల్‌ఫోన్‌కు గురువారం టెక్స్ట్ మెసేజ్ వచ్చింది. దానిని ఓపెన్ చేసి చూస్తుండగా నాలుగు విడతల్లో రూ.50వేలు రూపాయలను సైబర్ నేరగాళ్లు కాజేశారు. జరిగిన మోసాన్ని గుర్తించిన బాధితుడు సుబ్రహ్మణ్యం వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆ మేరకు వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఆన్‌లైన్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, ఆధార్, పాన్, ఏటీఎం, ఓటీపీ వివరాలను ఎవరికి పంపవద్దని తెలియజేశారు.

వైభవంగా కోడూరు గంగమ్మ జాతర



అమ్మవారి దర్శనానికి బారులుతీరిన భక్తులు



ప్రత్యేక పూజలు చేస్తున్న ప్రభుత్వవిప్ కొరముట్ల

రైల్వేకోడూరు అర్బన్ : మండల కేంద్రంలో గంగమ్మ జాతర గురువారం వైభవంగా నిర్వహించారు. జాతరకు పట్టణంతోపాటు చుట్టుపక్కల ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు, ప్రజలు తరలివచ్చి గంగమ్మను దర్శించుకున్నారు. జాతర వీధులన్ని జనసంద్రమయ్యాయి. ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు జరిపారు. అన్నదానం చేశారు. పాతబజారులో చలువ పందిళ్లతో అలంకరించారు. పట్టణంలోని అన్ని వీధులలో విద్యుద్దీపాలంకరణ చేశారు. గురువారం తెల్లవారుజామున స్థానిక అంకాలమ్మ గుడిలో భక్తిశ్రద్ధలతో గంగమ్మతల్లిని తయారుచేసి ప్రత్యేక పూజలు చేసి వేలాది మంది భక్తుల మధ్య అట్టహాసంగా పూలపల్లకీలో ఊరేగింపుగా అమ్మవారిని గంగమ్మ మిట్టకు తరలించారు. ఇసుక వేస్తే రాలనంతగా జనం హాజరయ్యారు. గంగమ్మ నడిచే దారిలో మొక్కుబడులు తీర్చుకొన్నారు. ఉదయం నుంచి వేలాదిమందిగా భక్తులు తరలివచ్చారు. అమ్మవారిని పలువురు ప్రముఖులు దర్శించుకొన్నారు.

చిట్వేలి : మండల పరిధిలోని రాజుకుంటలో బుధవారం రాత్రి ప్రారంభమైన గంగమ్మ జాతర గురువారం ప్రశాంతంగా ముగిసింది. ఐదు సంవత్సరాల తరువాత జాతర జరగడంతో వైభవంగా నిర్వహించారు. జాతర సందర్భంగా బంధువులు, స్నేహితులు, సన్నిహితులు గ్రామానికి రావడంతో గ్రామమంతా సందడి వాతావరణ నెలకొంది. జాతరలో రైల్వేకోడూరు ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు పాల్గొని, అమ్మవారిని దర్శించుకుని పూజలు జరిపించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ చెవ్వు శ్రీనివాసులరెడ్డి, మహేశ్వరరెడ్డి, రమణారెడ్డి, మలిశెట్టి వెంకటరమణ, లింగం లక్ష్మీకర్, సీఐ విశ్వనాథరెడ్డి, లోకేష్, కనకరాజు, చిన్నా పాల్గొన్నారు.

మన్నూరులో..



జాతరలో కొలువైన గంగమ్మ

రాజంపేట టౌన్ : మున్సిపాలిటీ పరిధిలోని మన్నూరులో గురువారం గంగమ్మ జాతరను ఘనంగా నిర్వహించారు. జాతర నిర్వాహకులు, భక్తులు వేకువజామునే అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని ఊరేగిస్తూ ప్రత్యేకంగా తయారు చేసిన వేప మండల గుడిలోకి తీసుకొచ్చి కొలువుదీర్చారు. అమ్మవారు గుడిలో కొలువుదీరగానే జాతర సందడి ఊపందుకుంది. ప్రత్యేక అలంకరణలో కొలువైన గంగమ్మ తల్లిని దర్శించుకునేందుకు భక్తులు పెద్దఎత్తున తరలివచ్చారు. భక్తులు అమ్మవారికి ఇష్టమైన నైవేద్యాలు సమర్పించారు. గతంలో ఎన్నడు లేని విధంగా మన్నూరు జాతరలో భక్తుల తాకిడి కనిపించింది. భక్తులకు అనేక మంది దాతలు నీళ్లు, మజ్జిగ సరఫరా చేశారు.